ప్రగతి పథం.. సంక్షేమంలో ఆదర్శం

- 3వ వార్డులో జోరుగా అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు
- సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.18.11 కోట్లు లబ్ధి



ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని గణేష్ సర్కిల్ ఏరియా అందంగా రూపుదిద్దుకుంది. సర్కిల్ పరిసరాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువ, కల్వర్టులు ఏర్పాటు చేశారు. గత టీడీపీ హయాంలో గణేష్ సర్కిల్‌లో రోడ్లు, కాలువలు లేవు. ప్రజల రాకపోకలకు అనేక ఇబ్బందులు పడేవారు. కాలువలు లేక ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉండేది. కంపువాసనతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. దోమల వల్ల వ్యాధుల బారిన పడేవారు. ఇదంతా గతం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో 3వ వార్డు అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది. ప్రధానంగా గణేష్ సర్కిల్ ఏరియాలో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయడంతో ప్రజల కష్టాలు తీరాయి. సర్కిల్ అందంగా రూపుదిద్దుకుంది. 3వ వార్డు పరిధిలోని గోకారిజెండా, గణేష్ సర్కిల్, భంభంసా హెబ్ సందు, వడ్డెగేరి ఏరియా, శక్తిగుడి ఏరియా అభివృద్ధి చెందాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ వార్డులో అభివృద్ధి చెందలేదని, నేడు జగనన్న పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందని విశ్వసిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ మద్దతు జగనన్నకే అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గణేష్ నగర్ కాలనీలో చేపట్టిన అభివృద్ధి వివరాలు

- 3వ వార్డు పరిధిలో జనాభా 3,680 ఉండగా, అందులో పురుషులు 1800, స్త్రీలు, 1880 మంది ఉన్నారు. పింఛన్లు 390 ఉన్నాయి.
- భగవాన్‌సింగ్ సందు ఏరియాలో 150 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.9 లక్షలు ఖర్చు చేశారు.
- కరెంట్ మల్లి సందు ఏరియాలో వంద మీటర్ల మేర రూ.4 లక్షలు ఖర్చు చేసి సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.
- గోకారిజెండా ఏరియాలో మున్సిపల్ జనరల్ ఫండ్స్‌కింద 80 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు.
- ఉర్దూ స్కూల్ వెనకభాగం 70 మీటర్లు, భంభం సాహెబ్ సందు ఏరియాలో 70 మీటర్లు, వడ్డెగేరి స్కూల్ ఎదురుగా 150 మీటర్ల మేర సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణ పనులను గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించారు.
- శక్తిగుడి ఎదురుగా సందులో 150 మీటర్లు, గోకారిజెండా ఉర్దూ స్కూల్ నుంచి గణేష్ సర్కిల్ వరకు పెద్ద కాలువ (3 అడుగుల కాలువ) 300 మీటర్లు రూ.20 లక్షలతో ఏర్పాటు చేశారు.
- గణేష్ సర్కిల్‌కు సమీపంలో రెండు పురుషుల సామూహిక మరుగుదొడ్లు, ఒకటి స్త్రీల మరుగుదొడ్డిని రూ.20 లక్షలతో ఏర్పాటు చేశారు.
- నాడు–నేడు పథకం కింద గోకారిజెండా ఏరియాలో రెండు ప్రభుత్వ పాఠశాలల నూతన భవనాలను నిర్మించారు.
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద రూ.4 లక్షలను ఖర్చు చేసి రెండు బోర్లు, మూడు మినీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు.
- మూడు ఇంటర్నల్ కనెక్షన్‌లు, ఒక్కో దాని నుంచి 30 కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. మూడు చోట్ల 100 కనెక్షన్లు ఇచ్చారు.
- ప్రజల అవసరం మేరకు వీధిలైట్ల ఏర్పాటు కోసం 10 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.





గణేష్ సర్కిల్ సమీపంలో పురుషులు, స్త్రీల సామూహిక మరుగుదొడ్లు, గోకారిజెండా ఏరియాలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, భగవాన్‌సింగ్ సందులో నిర్మించిన సీసీ రోడ్డు

వివిధ సంక్షేమ పథకాల ద్వారా వార్డుల్లో ప్రజలకు లబ్ధి

- జగనన్న అమ్మఒడి పథకం కింద 435 మందికి రూ.19,31,968 లబ్ధి పొందారు.
- జగనన్న విద్యాదీవెన పథకం కింద 153 మందికి రూ.20,63,330
- వైఎస్సార్ రైతు భరోసా కింద 82 మందికి రూ.38,82,500
- డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 39 మందికి రూ.3,88,676
- వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు (రైతులు) 7 మందికి రూ.23,271
- ఇన్‌పుట్ సబ్సిడీ 5 మంది రైతులకు రూ.59,550
- వైఎస్సార్ పింఛన్ కానుక కింద 489 మందికి రూ.4,41,59,750
- చేయూత పథకం కింద 282 మందికి రూ.1,29,75,000
- ఆసరా కింద 264 మందికి రూ.49,34,946
- సున్నా వడ్డీ (పొదుపు సంఘాల మహిళలకు) 485 మందికి గానూ రూ.11,22,091
- వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీతోఫా కింద ముగ్గురికి రూ.2 లక్షలు అందజేశారు.
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 126 మందికి రూ.64,3,597
- ఆరోగ్య ఆసరా పథకం కింద 76 మందికి రూ.7,03,700

లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు

- హౌసింగ్ పథకం కింద 123 మంది లబ్ధిదారులకు రూ.87,30,435 అందించారు.
- వైఎస్సార్ బీమా పథకం కింద 9 మందికి రూ.9.90 లక్షలు అందించారు.
- వాహనమిత్ర కింద 17 మందికి రూ.4.70 లక్షలు అందించారు.
- నేతన్న నేస్తం కింద 8 మందికి రూ.8.16 లక్షలు అందజేశారు.
- జగనన్న చేదోడు పథకం కింద 33 మందికి రూ.6.90 లక్షలు అందించారు.
- తెల్లరేషన్‌కార్డుదారులకు కోవిడ్ సమయంలో 878 మందికి రూ.8.79 లక్షలు సాయం అందజేశారు.
- జగనన్న తోడు (వడ్డీ) 60 మందికి రూ.15,269 అందించారు.
- ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ మొత్తం) రూ.11,33,55,77

పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)

- ఇంటి స్థలాలు 131 మందికి రూ.3,22,26,000
- జగనన్న విద్యా కానుక ద్వారా 241 మందికి రూ.17,11,582 అందజేశారు.
- 8వ తరగతి చదువుతున్న 14 విద్యార్థులకు రూ.1,85,188 ఖర్చు చేసి ట్యాబ్‌లను అందించారు.
- జగనన్న తోడు పథకం కింద 86 మందికి రూ.16,1,234
- జగనన్న గోరుముద్ద పథకం కింద 256 మందికి రూ.24,76,750
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద 420 మందికి రూ.78,66,600
- ఇంటింటికీ రేషన్ సరఫరా 996 మందికి రూ.2,17,56,624
- పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ మొత్తం) రూ.6,78,23,898 ఖర్చు చేశారు.

నాలుగున్నరేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చేశాం



వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో వార్డులో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దాం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హయాంలో కౌన్సిలర్‌గా కొనసాగుతూ అభివృద్ధి చేయడం ఎంతో సంతోషంగా ఉంది. అభివృద్ధి పనులకు సమృద్ధిగా నిధులు కేటాయించిన సీఎం వైఎస్ జగనన్నకు ఎంతో రుణపడి ఉంటాం.

– మహేశ్వరి, 3వ వార్డు కౌన్సిలర్

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం



14 ఏళ్ల టీడీపీ పాలనలో వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. గతంలో ఇంటి ముందు కూర్చోలేని పరిస్థితి ఉండేది. మురుగునీరు, దోమలతో ఇబ్బందులు పడేవాళ్లం. కంపు వాసన వెదజల్లేది. నేడు ఇంటి ముందు అందంగా సీసీ రోడ్లు ఏర్పాటు చేసి కాలువలను నిర్మించారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకే మా సంపూర్ణ మద్దతు.

– ఆనంద్, గణేష్ సర్కిల్ ఏరియా

క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఖాదర్‌లింగ స్వామి దర్గా

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

నష్ట పరిహారం అందించాలి



డీటీ రజనీకాంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆదోనిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాల రైతులను ఆదుకునేందుకు పరిహారం అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం అధ్యక్షులు నరసప్ప మాట్లాడుతూ తీవ్ర వర్షాభావం కారణంగా ఈ యేడాది రైతులకు కనీసం పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో అప్పు చేసి పంటను సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరవు సహాయాన్ని రైతులకు అందించాలని కోరారు. నాయకులు లక్ష్మిరెడ్డి, సుదర్శన్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి ట్రాక్టర్ దగ్ధం



ట్రాక్టర్‌లో ఉన్న గడ్డికి నిప్పంటుకుని పొగలు కమ్ముకున్న దృశ్యం

ఆదోనిరూరల్: ఆదోని పట్టణశివారు ప్రాంతంలో దాదాపీర్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం ట్రాక్టర్‌లో వరిగడ్డిని తరలిస్తుండగా అగ్గిరవ్వలు పడి వరిగడ్డి పూర్తిగా దగ్ధమయ్యింది. వివరాల్లోకి వెళితే.. సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన మలిగప్ప కురుకుంద గ్రామానికి పశువుల మేత కోసం వరిగడ్డిని తన బంధువులకు ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. ఫ్యాక్టరీ సమీపంలో చెత్తను తగలబెట్టిన నిప్పురవ్వలు పడి వరిగడ్డికి నిప్పంటుకుంది. డ్రైవర్ ట్రాలీని వదిలి వెళ్లడంతో గడ్డితో పాటు ట్రాలీ పాక్షికంగా దగ్ధమైంది. ఈ సంవత్సరం వర్షాలు సరైన సమయంలో పడకపోవడంతో ఉన్న కాస్త మేతను తరలిస్తుండగా మార్గ మధ్యలో ఇలా జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

భారత్ బ్రాండ్ సరుకుల విక్రయాలు ప్రారంభం



ప్రజలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోనిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న భారత్ బ్రాండ్ గోధుమ పిండి, శనగ పప్పు విక్రయాలను ఆదోని మార్కెట్ యార్డులోని కేడీసీఎంఎస్ కేంద్రంలో గురువారం బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, పట్టణాధ్యక్షుడు సాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలనే సంకల్పంతో సబ్సిడీ ధరకు సరుకులను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కిలో శనగపప్పు రూ.60, గోధుమపిండి రూ.27.50 కే అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలో భారత్ రైస్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. కేడీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి విజయకృష్ణ,జిల్లా కార్యవర్గ సభ్యులు మహాదేవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దేవేంద్రకుమార్, కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఫారం–6, 7, 8తో పాటు ఈవీఎం మిషన్ పనితీరుపై బీఎల్‌ఓలు, సెక్టోరియల్ ఆఫీసర్లకు తహసీల్దారు ప్రసాద్‌రాజు అవగాహన కల్పించారు. అలాగే ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు తొలగించడం, ప్రతి దరఖాస్తుదారుడి పేరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఈగా చలపతి



కార్మికులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంఈఈ చలపతి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో డీఈగా పని చేస్తున్న చలపతి ఇన్‌చార్జ్ ఎంఈఈగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఈ రాధాకృష్ణ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో డీఈ చలపతిని నియమించారు.బాధ్యతలు చేపట్టిన అనంతరం వాటర్‌వర్క్స్,ఎలక్ట్రిషియన్ వివిధ సెక్షన్ల సిబ్బంది, కార్మికులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేద్దామని ఆయన ఉద్యోగులు, సిబ్బందిని కోరారు. ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు

క్రీడాకారులు సత్తా చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న చంద్రకాంత్ రెడ్డి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం– ఆంధ్ర' క్రీడాపోటీల్లో ఆదోనికి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను వైఎస్సార్‌సీపీ పట్టణ, ఏపీఆర్‌ఆర్ క్లబ్ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన పోటీల్లో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు కాశీం, మనోజ్ మొదటి స్థానంలోను ఉదయ్‌కుమార్ రెండవ స్థానంలోను ప్రభాకర్, రామ్‌నాయుడు, గోవర్ధన్ మూడవ స్థానంలో నిలిచి బహుమతులను గెలుచుకున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో కూడా కాశీం, మనోజ్ మూడవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఏపీఆర్‌ఆర్ క్లబ్ సభ్యులు విట్టా సురేంద్ర బాబు, కార్యదర్శి హరినాథరెడ్డి, వెంకటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టైర్ల చోరీపై కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారులో వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంటు వద్ద ట్రాక్టర్ల టైర్లు చోరీ కావడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 30న రాత్రి మదర్ ప్లాంటు వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్లలో మూడు ట్రాక్టర్లకు సంబంధించి ఆరు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విదితమే. ఘటనపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



సోమలగూడూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల వేళ అల్లర్లు, గొడవలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఈరన్న స్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ మొట్టమొదటి డిప్యూటీ కమిషనర్‌గా హెచ్‌జీ.వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గురువారం ముందుగా ఈరన్న స్వామిని దర్శించుకుని బాధ్యతలను తీసుకున్నారు. శ్రీశైలం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న హెచ్‌జీ.వెంకటేష్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలను కలుపుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వాణి కాణిపాకం దేవాలయానికి బదిలీపై వెళ్లారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



జేబీఎం స్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ ఆఫీసర్ రాముడు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు పరిశీలన చేసినట్లు సెక్టోరియల్ ఆఫీసర్ రాముడు, సెక్టోరియల్ పోలీస్ ఆఫీసర్ మల్లికార్జున తెలిపారు. గురువారం కోసిగిలోని జేబీఎం స్కూల్‌లో 116, 117, 108 పోలింగ్ కేంద్రాలు, ఉర్దూ స్కూల్‌లోని 106, 107 కేంద్రాలు, కుమ్మరివీధి పాఠశాలలో 114, 115 పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. అందులో ఓటర్లకు అనువుగా ఉండేలా గదులు, విద్యుత్ సౌకర్యం తాగునీరు, టాయిలెట్స్, వికలాంగులకు ర్యాంపు సౌకర్యాలు ఉండేలా పరిశీలన చేసినట్లు తెలిపారు. సమస్యలు ఉంటే గుర్తించి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. జేబీఎం పాఠశాల హెచ్‌ఎం రాజమౌళి, బీఎల్‌ఓలు సుంకప్ప, చంద్రకళ, సరోజలు ఉన్నారు.

రూ.10 లక్షలతో విద్యుదీకరణ పనులు



భూగేని చెరువు సమీపంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేయిస్తున్న ఎంపీపీ ఈరన్న, ట్రాన్స్‌కో ఏఈ వీరేష్

కోసిగి: మండల శివారు భూగేని చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మోటార్లకు విద్యుదీకరణ పనులు చేపడుతున్నట్లు ఎంపీపీ ఈరన్న తెలిపారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక నిధులు రూ.10 లక్షలతో గురువారం స్థానిక భూగేని చెరువు వద్ద విద్యుదీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. స్టోరేజీ ట్యాంక్ కోసం మెయిన్ లైన్ నుంచి 24 విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలో పిల్లర్ బెడ్స్ పనులు వెంటనే ప్రారంభించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీపీ చెప్పారు. అలాగే రంగప్ప గట్టు, 3వ వార్డు కాలనీలో చేపడుతున్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కోసిగి ప్రజలకు పుష్కలంగా తాగునీటిని అందించేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



హొళగుందలో వివాద స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద బీసీ కాలనీలో వివాదాస్పదంగా మారిన సామూహిక మరుగుదొడ్ల స్థలంతో పాటు గజ్జహళ్లి, హొళగుంద తదితర గ్రామాలలో భూములను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ గురువారం పరిశీలించారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్‌తో రైతులు తమ పొలాలను నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తులకు సంబంధించి ఆయన ఆ గ్రామాలలో పర్యటించారు. దరఖాస్తులో పొందుపరిచిన రికార్డుల మేరకు పొలాలను పరిశీలించి తహసీల్దారు ప్రసాద్‌రాజుకు సూచనలిచ్చారు. అదేవిధంగా హొళగుంద బీసీ కాలనీలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని స్థానిక మహిళలకు హామీఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో వలసల నివారణ, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతుల నుంచి సర్వేయర్లపై ఆరోపణలు వస్తున్నాయని తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది పని తీరు తదితర వాటి గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఆర్‌ఐ దినోజ్, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓలు ఉన్నారు.


కర్ణాటక మద్యం స్వాధీనం

చిప్పగిరి: మండలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో బైక్‌పై కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న మొగలవల్లి గ్రామానికి చెందిన ఎరుకల మహేష్‌ను రామదుర్గం పరిసర ప్రాంతంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. నిందితుడి నుంచి 672 హైవార్డ్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది యశ్వంత్, కృష్ణసాగర్ తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

తుగ్గలి: పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. గురువారం మండల పరిధిలోని బాటతండలో ఉపాధి హామీ పథకం కింద రైతులు నాటుకున్న మామిడి తోటలు, వైఎస్సార్ జలకళ బోర్లను పరిశీలించారు. ఉపాధి పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం మూడేళ్ల పాటు నిధులు ఇస్తుందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఉచితంగా బోర్లు తవ్వించి మోటారు, విద్యుత్తు తదితర వాటన్నంటినీ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అంతకుముందు ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏపీఓ రామకృష్ణ, క్లస్టర్ టీఏ గంగన్న, ఈసీ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమానాయక్ ఉన్నారు.

వాల్మీకుల పాదయాత్ర విజయవంతం



ఆదోనిలో ర్యాలీగా వెళ్తున్న వాల్మీకి కులస్తులు

ఆదోనిరూరల్: తమను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో పెద్దతుంబళం నుంచి ఆదోని వరకు గురువారం చేపట్టిన 'వాల్మీకి న్యాయ పాదయాత్ర'లో పెద్ద ఎత్తున బోయలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పార్థసారథి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా.. పాదయాత్ర కన్వీనర్ వాల్మీకి పరమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీల నాయకులు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని కల్లబొల్లి మాటలు చెబుతూ అధికార పీఠం ఎక్కుతున్నారన్నారు. వాల్మీకుల ఎస్టీ సాధనకై పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. పెద్ద ఎత్తున వాల్మీకులు తరలివచ్చి ఐక్యతను చాటి చెప్పడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పాదయాత్ర కో–కన్వీనర్లు ఉషారాజు, చిరుతపల్లి ఈరన్న, ఆరేకల్ రాజేష్, మాజీ ఎంపీపీ పంపాపతి, సూరప రాజు, కేశవ రెడ్డి, నరసారెడ్డి, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

10న రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 10వ తేదీన చింతమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి అర తులం బంగారు, తర్వాతి స్థానాల వారికి వరుసగా 30 తులాల వెండి, 25, 20, 15, 12, 10, 8, 6, 5 తులాలు వెండి అందించనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 98492 81708, 90003 71857 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.